రైలు ప్రయాణం ఒక సరదా, ఒక ఆనందం, అద్భుతం. ఒక్కోసారి భయం కూడా! కొత్త వ్యక్తులను, కొత్త ప్రాంతాలను పరిచయం చేసే రైలు ప్రయాణం గురించి ఇద్దరు రచయితలు, ఒక కవి ఏమంటున్నారో వరుసగా చదవండి.


# దీపం

షేక్ మస్తాన్ వలి

కొన్నేళ్ళ క్రితం...

ఏప్రిల్లో లతతో కలిసి సామర్లకోటకు బయలుదేరాను.

మా శ్రీవార్లు తిరుపతి ఎలక్ట్రిసిటిలో ఏ.ఇ.లుగా వుండేవారు. బ్యాంక్ కాలనీలో నివాసం. కలిసిమెలిసుండేవాళ్ళం. ఇద్దరిదీ సామర్లకోటే పుట్టిల్లు. మా స్నేహానికదో ముఖ్యకారణం. ఇరవై ఐదేళ్ళ వయస్సులో మిసమిసలాడే మమ్మల్ని కాలనీ బ్యూటీలనే వారు.



నా కిద్దరు పిల్లలు. బాబుకు నాలుగేళ్ళు. పాపకు రెండేళ్లు. లతకిద్దరూ మగ పిల్లలే. పెద్దోడికి మూడేళ్ళు. చిన్నోడికి ఏడాది. వాడు పోత పాలపై వున్నాడు. అది మళ్ళా నీళ్ళోసుకొంది. ఆరోనెల. లత నాన్న దాన్ని పురిటికి తీసుకెళ్లాల్సుంది. వీల్లేక ఆ పని నాకప్పగించారు స్కూళ్ళ శలవలైనందున ఒప్పుకొన్నాను. ప్రయాణం ఖాయమైంది.

''ఈ పెట్టె గూడూరులో డిటాచ్ చేసి సర్కార్‌కు అటాచ్ చేస్తారు...సో మీ వూరి దాక బేఫికర్!'' రేణిగుంటలో మావార్లు అదేదో మద్రాస్ రైలెక్కించి వీడ్కోలిచ్చారు.

సాయంత్రం ఆరుకు రైలు కదిలింది.

సీట్లలో కూర్చుని మాటల్లో పడ్డాం. పిల్లలు ఆడుకొంటున్నారు. పరుగెత్తే పరిసరాలు, నిమిరే చిరుగాలి, కంటికి, వంటికి హాయిగున్నాయి. ప్రయాణం ఆనందంగా వుంది.

గూడూరు గంటకొస్తుందనగా లత చిన్నకొడుకు ఏడ్వసాగాడు. పాలకు వేళయిందని, లత బ్యాగ్ లోంచి ఖాళీ సీసా తీసి కడిగి మరలా ఏదో వెతికి బిక్క ముఖమేసింది.

''ఏంటే?''

''అనూ! కొంప మునిగిందే! పాల ఫ్లాస్క్ మరిచిపోయానే! పెద్దచిక్కే!''

''ఏంచేద్దాం?''

''ఎవరి దగ్గరన్నా స్పేర్‌గా పాలున్నాయేమోనే!''

ఆ సలహా మేరకు పెట్టెలో పిల్ల తల్లుల్ని అడిగా. ఫలితం లేదు. ఏడ్పు ఆరున్నర శృతిలో వుంది. మా లాలింపులు, ఓదార్పులు వీగిపోయాయి. ప్రక్క వారి సహకారం వృధా అయింది.

మదిలో ఓ మెరుపు.

సంచిలోని ఫుల్ బిస్కట్ ప్యాక్‌ను వాడికివ్వజూపాను. కాని వాడు దాన్నొక్కతోపు తోసాడు. ఆ ప్రయత్నం తుస్సంది.

పెద్ద పిల్లలు నిద్రకు జారుకొన్నారు. పాప మాత్రం కళ్ళు రిక్కించి ఏడ్చే బుజ్జిగాడ్నే చూస్తోంది.

''అమ్మాయ్! కాసేపట్లో గూడూరొస్తది! పెట్టెను సర్కార్‌కు తగిలించటానికి గంట పట్టిద్ది! ఆలోగా పాలు తెచ్చుకోండి!'' మా అవస్థ గమనిస్తోన్న ఓ పెద్దావిడంది.

''థాంక్స్.... ఆంటీ!'' అన్నాను.

పిల్లోడి హఠం విసుగు పుట్టిస్తోంది.

లత సీసాలో నీళ్ళు నింపి వాడికి పట్టింది. ఒక్క గ్రుక్క త్రాగి వాడు దాన్ని ప్రక్కకు నెట్టి ఏడ్పు పెంచాడు.

''ఊc..! లాభంలేదే!..పాలు పడందే ఆగడే..రాక్షసుడు! అంతా కర్మ!'' అది తల కొట్టుకొంటోంది.

అసలే గర్భవతి ! ఆ పై గడ్డుస్థితి! ఆయాసపడ్తోంది. దానవస్థకు జాలేసింది. ఏం చేయగలం? ఒక్కోసారి చిన్న అవసరాలూ నెరవేర్చలేని అశక్తత! అదే ఆలోచిస్తూన్నా.

''గూడూరొచ్చిందమ్మాయ్!'' పెద్దావిడ పిలుపుతో నిద్రోతున్న మా పెద్దోడ్నిదిలేసి పాపనెత్తుకొని సీసాతో ప్లాట్‌ఫాంపై దిగాను.

వడిగా నడుస్తూ మధ్యలో కంపార్టుమెంటు నంబర్ చూసుకొని కాఫీ స్టాల్ చేరాను. రద్దీగుంది. జనం స్నాక్స్, డ్రింక్స్‌లో మునిగి వున్నారు.

''పాలు కావాలి!'' పెద్దగా అరిచాను.

''ఎన్నీ?'' షాపతను తల త్రిప్పాడు.

''దీన్నిండా!'' సీసా చూపించాను.

''మూడు కప్పులు పడ్తోంది! ఆరు రూపాయలు!''

''అలాగే!'' డబ్బు, సీసా అందించాను.

''పాలు వేడౌతున్నాయ్!... కాసేపాగమ్మా!'' అతను పనికంకితమయ్యాడు.

జనం రద్దీ పెరుగుతూనే వుంది. ఓర్పుకు పరీక్ష! నిలబడి మధ్య మధ్యలో కంపార్టుమెంటును గమనిస్తోన్నా.

''వెంటనే తెమలితే బాగుండు:'' మనస్సు ఆరాటపడుతోంది.

చివరకు సీసా చేతికొచ్చింది. పెద్ద రిలీఫ్! సంతోషంగా వెనుతిరిగాను.

ఆశ్చర్యం!

కంపార్టుమెంటు కదుల్తూ కనిపించింది.

పరుగెత్తాను. ఫలితం లేదు. దూరమెళ్లింది. లత కంగారుగా చేయూపుతూ కిటికీ వద్ద లీలగా అగుపించి కనుమరుగైంది.

అంతే! అయోమయం, అగమ్యం నన్నావహించాయి. ఒళ్ళంతా చెమట పట్టింది.

''ట్రయిన్ గంటుంటుందన్నారు గదండీ! అప్పుడే వెళ్ళిందేంటి?'' అటుగా వచ్చిన రైల్వే వుద్యోగినడిగాను.

''కంగారు పడబాకమ్మా! ఆ పెట్టె నలభై నిముషాల్లో యిక్కడికే వస్తోంది! షంటింగ్‌కు తీసుకెళ్ళారు!''

ఆయనలా అన్నాడు గాని నాకంతా కంగారుగుంది.

''అక్కడేమో చంటోడు పాలకేడుస్తోన్నాడు! ఇక్కడేమో నే చిక్కుకు పోయా! నాకేమైందోనని లత బెంగపడ్తోంటోంది! ఈ లోగా మావాడు మేలుకొంటే హైరానే...హైరానా! దేవుడా!...యిలా అయిందేంటి? ఏం చేయాలి?'' గొణుక్కొంటూ వెయిటర్ బెంచ్ పై కూలపడ్డాను.

టైం తొమ్మిది.

జనం పలుచబడ్తోన్నారు. అప్పుడు ఓ ప్లాట్‌ఫాం రోమియో కాలరెగబట్టి బెంచ్‌పై బైటాయించాడు. దాంతో ఆగక సిగరెట్టు తగలెట్టి ఆ ప్రాంతాన్ని కలుషితం చేస్తూ నన్ను కళ్ళతో త్రాగేస్తోన్నాడు.

వాడ్ని చూస్తోంటే అసహ్యంగుంది.

''పంది!...కుక్క!.. ఎంత ఆబగా చూస్తున్నాడో! యింగితం గూడా లేదు. యిడియట్‌కు!'' గొణుక్కొంటూ తల త్రిప్పుకొన్నాను.

''ఇదో క్రొత్త సమస్య!... ఏం చేస్తాం! ఒంటరాడదంటే మగాళ్ళకదో వెర్రి! తమ స్త్రీల సంగతే మరిచిపోతారు!...ప్చ్!...ఎప్పుడు మారేనీ సమాజం!'' సడలే ధైర్యాన్ని కూడగట్టుకొని వాడ్ని పదేపదే వురిమి చూస్తూ బెంచ్ చివరకు జరిగి పైట లాక్కొని పాపను బుజ్జగిస్తూ కూర్చున్నాను.

నా ఛీత్కారాలు ఛండాలుడి పై పన్జేయలేదు. వాడి వికృత చేష్టల్లో మార్పులేదు. క్రమేపి సహనం నశిస్తోంది. ఘర్షణకు దిగుదామనుకుంటూన్నాను.

''ఏంటయ్యా? నీ సిగరెట్టు!... అమ్మాయి అవస్థపడుతోందిగా!.. ఆ మాత్రం తెలుసుకొని ప్రక్కకెళ్లలేవా?'' నా అవస్థ గమనించిన ఓ రైల్వే వుద్యోగి అటుగా వచ్చి రోమియోను అదిలించాడు.

అంతే! అతగాడు మారుమాట లేకుండా జారుకున్నాడు.


''పీడా వదిలింది!'' హాయిగా గాలి పీల్చుకొని ఆదుకొన్నాయన వైపు చూసాను.


అతను మధ్య వయస్కుడు. తెల్లని డ్రెస్‌లో మఫ్లర్ చుట్టుకొని, చేతిలో టార్చితో వున్నాడు.

''ఏంటమ్మాయ్!.. ఏ ట్రెయిన్‌కెళ్ళాలి?'' అతనడిగాడు.

''...అలా నా ఫ్రెండ్ కొడుకు పాల కోసం సొమ్మసిల్లున్నాడండీ! త్వరగా వెళ్ళకపోతే వాడికేమైద్దోనని భయంగుంది!'' విషయం వివరించాను.

కాసేపాలోచించి, ''అలాగా!..మరి నాతో వస్తావా?...అక్కడికి తీసుకెళ్తా!'' అన్నాడు.





## సినిమాగా సొంతకథ

**సు**స్మితాసేన్, విక్రంభట్‌ల మధ్య ఒకప్పుడు జోరుగా ప్రేమ పురాణం నడిచింది. ఈ ఎఫైర్‌తో విక్రం కాపురంలో కలతలు ఏర్పడ్డాయి. దీన్నే కథాంశంగా తీసుకుని విక్రం ఇప్పుడో సినిమా తీస్తున్నారు. వెనుకటికి మహేష్‌భట్ తన కథను తానే 'అర్థ్' అనే సినిమాను తీసిన తరహాలో ఇప్పుడు విక్రం కూడా అదే పని చేస్తున్నాడు. విక్రం, అతని భార్యగా సంజయ్‌సూరి, దివ్యాదత్తా ఎంపికైతే సుస్మితా పాత్రలో రీతూపర్ణాసేన్ గుప్తా నటిస్తోంది. అయితే విక్రం ప్రస్తుత గర్ల్‌ఫ్రెండ్ అమీషాపటేల్ దివ్యాదత్తాను పక్కకు తోసేసి ఆ పాత్రలో తాను నటిస్తోంది. ఈ సినిమా ఎంత మాత్రం తన సొంత కథ కాదని విక్రమ్ అంటున్నాడు. సుస్మితా మాత్రం మౌనం వహించి సమయంకోసం బెంగాల్ పులిలా ఎదురుచూస్తోంది.

''పదండీ!'' సిద్ధమయ్యాను.

అతను నావైపు తేరిపారచూసి బయల్దేరాడు. మౌనంగా అనుసరించాను.

నడక స్టేషన్ చివర ఆగింది.

అతను ప్లాట్‌ఫాం దిగాడు.

ముందుకెళ్ళటానికి తటపటాయించాను. కారణం అక్కడ యార్డు లైటింగ్‌గాని, జన సంచారం గాని లేదు. ఉన్నదంతా చీకటే. అపరిచితుడితో వెళ్ళటం సేఫ్ అనిపించలేదు. ఎప్పుడో చదివిన అత్యాచారాలు గుర్తొచ్చి భయమేసింది. ఆగిపోదామనుకున్నాను. కాని, అప్పటికే దూరమొచ్చాం. తోడు లేక వెనక్కెళ్ళటం సులువేం కాదు. ఇక అతనితో వెళ్ళటం తప్పలేదు.

టార్చి ముందుకు వెనక్కు వేస్తూ నడక సుగమం చేస్తోన్నాడు.

అక్కడ దారేం లేదు. కంకర రాళ్ళు, రైలు పట్టా, సిగ్నల్ తీగలు, డిస్‌కార్డెడ్ బోగీలు, స్లీపర్లు, పిచ్చి మొక్కలు, క్రీపర్లతో గజిబిజిగున్న ప్రదేశమది. ప్రతి అడుగు జాగ్రత్తగా వేయాల్సొస్తోంది.

మెల్లగా ఓ చిమ్మ చీకటి ప్రాంతానికి చేరాం. ట్రాక్ ప్రక్కన కీచురాళ్ళు, దూరంగా వూర కుక్కల శబ్దాలతో పాటు మా అడుగుల చప్పుడు భయంగొల్పుతొన్నాయి.

''ఇలాంటి ఏకాంతంలో మగ, ఆడ కలసి ప్రయాణమెంత అనర్థం! క్షణం చిత్త భ్రమిస్తే బ్రతుకు బండలేగా!'' భయం గుప్పెట బిగుస్తోంది. అడుగులు తడబడ్డాయి.

ఇంతలో అతను వెనక్కు తిరిగి టార్చేసుకొని నా దగ్గరికొస్తున్నాడు. పొంచి పొంచి వేస్తోన్న అడుగులు అనుమానాన్ని రేకెత్తిస్తున్నాయి.

అంతే! వణుకు మొదలైంది. చెమటతో శరీరం ముద్దయింది. జారకుండ పాపను పొదివి పట్టుకొని నిర్వికారంగా నిలబడ్డాను.

''అయిపోయింది. బ్రతుకు తెల్లారింది. కాముకుడి కాటు పడనుంది!..దేవుడా! ప్లాట్‌ఫాం పైనుంటే పోయేదేమో!.. ఈ రాక్షసుడేం చేస్తాడో? పాపేమౌద్దో?'' తుఫాన్ మనస్సును కలచివేస్తోంది.

చూస్తుండగానే అతను దగ్గరికొచ్చాడు.ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ప్రస్ఫుటంగున్నాయి. బలాత్కారపు అంచుల్లో గిలగిలలాడేను. అరుద్దామనుకున్నా. కాని భయంతో గడ్డగట్టి మాట పెగల్లేదు. కళ్ళు మూసుకున్నాను. బుర్ర పనిచేయటం లేదు.

''దారి బాగాలేదు! బిడ్డనెత్తుకొని నడవలేవు!...అమ్మాయినిలా యివ్వు! టార్చి తీసుకో!'' చేతులు చాస్తూ అతనన్న మాటలు నన్ను యిహ లోకంలోకి తెచ్చాయి.

భయం కొంత తగ్గింది. ఆలోచించసాగాను.

పాపనివ్వమంటానికి చెప్పిన కారణం సబబే అనిపించినా ఎందుకో దాని వెనుక దురుద్దేశ్యం వుందని పించింది.

''జాగ్రత్త అనూ! జాగ్రత్త! బిడ్డను వేరు చేసి తేలిగ్గా అత్యాచారం చేయటానికి ప్లానేస్తోన్నాడు!... కీచకుడు!...చూశావా?...పైకెంత బాగా నటిస్తున్నాడో!'' మనసు గింజుకుంటుంటే పాపనివ్వటానికి వెనుకాడేను.

కాని అతను టార్చి నాకివ్వటం, పాపను లాక్కోటం, భుజానేసుకోటం, ముందుకు నడవటం, చకచకా జరిగిపోయాయి.

నిర్ఘాంతపడి చూస్తోన్నా.

''ఏంటి?..త్వరగా రా!'' అప్పటికే దూరమెళ్ళిన తను గద్దించాడు.

అతని వాలకంపై అనుమానం ప్రబలుతుంటే, ''ఆఁ!'' అని ఉలిక్కిపడి, కదిలి టార్చేయసాగాను.

ఏక్షణానైనా దాడి జరగొచ్చు! అదే జరిగితే, పారిపో అనూ! పారిపో! ఏది మానం కంటే ఎక్కువ కాదు!''అంతరంగ హెచ్చరిక నన్నతనికి పది బారల దూరంలో వుంచసాగింది.

అభద్రతా భావం పదిహేను నిముషాలు నన్ను పిండి పిప్పి చేసింది.

ఆ పై సస్పెన్స్ తీరింది.

అవుటర్ సిగ్నల్ కనిపించింది.

అక్కడ కంపార్టుమెంటు చూడగానే జవసత్త్వాలొక్కసారి పుంజుకొన్నాయి. క్షోభనెవరో చేత్తో తీసేసి ఆనందంతో నింపినట్లయింది.

పరిస్థితుల దృష్ట్యా యిప్పటిదాక ఆవహించిన అనుమానపు మంచు కరిగిపోగా సూర్యబింబం లాంటి పెద్దాయన వ్యక్తిత్వం వెలుగులతో సాక్షాత్కరించింది. మనస్సులోనే తలొంచి నమస్కరించాను. జరిగిందానికి పశ్చాత్తాపపడ్డాను.

పెట్టెలో స్థితి దైన్యంగుంది. పాపడు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లాడు. నిద్ర లేచిన మా పెద్దోడు అమ్మ కావాలంటూ గోలెడ్తోన్నాడు. ఆ గలభాకు మేల్కొన్న లత పెద్దకొడుకు తోడేద్చేస్తోన్నాడు. ఒక వైపు ఏడ్పుల బెటాలియన్‌తో, రెండో వైపు నా బెంగతో లతకు ఏడ్పొక్కటే తక్కువగుంది.

''అనూ! వచ్చేశావా!..అమ్మయ్య!'' లత మాటల్లో ఆత్మీయత ఉప్పెనైంది.

''ఆ!...వచ్చాన్లేవే! కంగారు పడకు!'' నా కళ్ళు ఆర్ద్రమయ్యాయి.

లత పరుగున కంపార్టుమెంటు డోర్ దగ్గర కొచ్చింది. పెద్దాయన పాపనందించాడు. అది దాన్ని తీసుకెళ్ళి పడుకోబెట్టింది. మేము పెట్టెలోకి చేరాం.

లత పాలసీసాను చంటోడి కందించింది. వాడు గుటక్ గుటక్ లాడిస్తోన్నాడు. అది చూసి దాని మాతృత్వం, దాన్ని చూసి నా స్నేహం మురిసాయి.

పెద్దపిల్లలు ఏడ్పుమానారు.

''మీ పేర్లేంటమ్మా?'' పెద్దాయన ఎదురు సీట్లో కూర్చోన్నాడు.

''అది లత, నేను అనురాధ!'' చెప్పాను.

''అలాగా!'' ఆయన మా వైపే చూస్తోన్నాడు.

జరిగింది లతకు టూకీగా చెప్పాను.

''ఎలాగో లేవే!..గండం గడిచింది!...అంతా వీరి చలువే!'' అది ఆయన వైపుచూసింది.

''థాంక్సండీ!'' ఆనందంతో యిదర్దమొకటేసా రన్నాం.

''మెన్షన్ నాట్!'' నామ మాత్రంగా అన్న ఆయన ముఖం మరుక్షణం సీరియస్సైంది.

''అమ్మాయ్ లతా! పాలఫ్లాస్క్ లేకుండా పిల్లోడితో ప్రయాణానికి రెడి అవుతావా? అదెట్టమ్మా?..అంత బద్ధకమైతే ఏ డ్రెస్సో, చెప్పులో, బెడ్‌షీటో మరిచిపో!...ఫర్వాలేదు!...అంతేగాని పాల సామాగ్రి కాదమ్మా!...చూసావుగా! అట్టా చేసి ఎలా కష్టాలు కొనుక్కున్నావో?...బుద్ధున్నంత దాక మళ్ళా అట్టా చేయగాకు!'' ఆయన పలుకులు ములుకుల్లా వున్నాయి.

''అలాగేనండీ!'' తప్పు తెలుసుకొన్న లత వినయంగా తలాడించింది.

ఇక నావంతు.

''అనూరాధా!...వీరనారి! వివరాలు తెలియవ్! అయినా పసిపిల్లతో ప్లాట్‌ఫాం పై దిగుతుంది!... ఊఁ! సరే! కంపార్టుమెంటులేదు!...వెళ్లింది! అయితే ఏంటంటా?..కాసేపాగితే వస్తోందిగా! అంతలోనే ముక్కు ముఖం తెలియనోడితో, రాత్రివేళ, ఎవరు లేని ప్రదేశంలో వెళ్ళటానికి తయారౌతావ్?!...మనుష్యులపై అంత నమ్మకమొద్దమ్మా! ఎవడేంటో ఎవడికి తెలుసు! వేళ బాగుంది నాతో వచ్చావ్! అదే ప్లాట్‌ఫాం రోమియోలాంటోడైతే... ఆనక ఏడిస్తే ఏముందమ్మా!... ఆలోచించు!'' ఆయన మాటల్లో ఆవేదనుంది.

''తప్పేనండీ!'' చేసిందెంత దుస్సాహసమో తెలిసిరాగా తలొంచుకొన్నాను.


''తెలియక చేసినా, తెలిసి చేసినా తప్పు నిప్పేనమ్మా!...పర్యవసానం తప్పదు! అందుకే యింకెప్పుడు అలా చేయకండీ!...వస్తాను! గుడ్‌నైట్ అండ్ హాపీ జర్నీ!'' అని ఆయనెళ్ళిపోయాడు.

ఆ సహృదయతకు మౌనంగా శతాధిక కృతజ్ఞతలు తెలిపాం.

అలా ఆయన వీడ్కోలిచ్చారు. కాని ఆయన సలహా మాలోను, మా బంధు మిత్రుల్లోను ఓ దీపం వెలిగించింది. అది మా ప్రయాణాల్లో వెలుగునిస్తూనే వుంది.

★

# ప్రయాణం - ఒక కొత్తపొద్దు



ఎన్ని ప్రయాణాలు నన్ను మభ్యపెట్టాయో
మరెన్ని భయపెట్టాయో
ప్రతీ ప్రయాణం ఒక కొత్తపొద్దు
నాకు ప్రయాణించడమే తెలుసు
ప్రతి ప్రయాణానికీ బలపడడమే తెలుసు

మూసిన కిటికీ అద్దంపై
ఫెళ్ళున విరిగిపడి
ఆప్తునికిచ్చే వీడ్కోలులా
నీరైపోతున్న వానచినుకులు...
ప్రయాణం పొడుగునా వెంబడిస్తున్నాయి
ప్రయాణమన్నాక
వానలు చూస్తామా వరదలు లెక్కిస్తామా!
గాలి చెదురుడుకి
కొమ్మల్ని విరబోసుకుని
పంజాలు విసిరి కోరలు చూపిస్తూ
మీదికి దూకుతున్న ఆల్సేషియన్లలా
చెట్లు
నన్ను భయపెట్టకుండా
రైలు తన కడుపులో దాచుకుంది

ఎప్పుడు ప్రయాణం చేసినా
అనేక ప్రయాణాలు ఏకబిగిన
నాలో ప్రవహిస్తుంటాయి
ఒక ప్రయాణపు వాగులోంచి
మరో వాగులోకి
అడ్డదిడ్డంగా ఈదుతూనే
అసలైన దిశగా పయనించే
అభ్యాసం చేస్తుంటా
ప్రయాణాల పడుగు పేకల్తో
జీవితాన్ని అల్లుకుంటా

సొమ్మసిల్లేంత అలసినా
ఆట వెనకే పరిగెత్తే పిల్లాడిని
చాటుకు లాగి
గబుక్కున నోట్లో గుగ్గిళ్ళు పోసే
అమ్మలాగా ప్లాట్‌ఫారం
అమ్మ కొంగుతో మూతి ముడుచుకుని
మళ్ళీ తుర్రుమనే రైలు

సొరంగంలో దూరి
రైలు
బయటకొచ్చిన ప్రతిసారీ
దిగుడుబావిలో
మునక మునకకీ పైకిలేచే
చిన్ననాటి ఆకతాయి ఈత విన్యాసాలు
గుర్తొచ్చి పోతుంటాయి

ఎక్కడా కలవకుండా
పక్కనే పరిగెత్తే పట్టాలపై
అటేపు వెళ్ళే రైల్లో కూడా
ఒకప్పుడు ప్రయాణించా

పట్టాలు అవే
దిశల్లోనే తేడా
ప్రయాణాలు అవే
అనుభవాలే తేడా

ఎక్కవలసింది ఆ రైలా... ఈ రైలా అన్నది
ఎక్కకముందు ఆలోచన
అసలిన్ని ఆలోచించి ఎక్కితే
ప్రయాణపు ఆనందం ఏం మిగుల్తుంది
గమ్యంకోసం ఎదురుచూపులు తప్ప?

**- వి.రామమనోహర్**